# దొంగలు

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

"కొన్ని కొన్ని నిక్షిప్త మయిన మనుషులలోని చెడుగుణాలని నమ్మలేమనం. అవి సహజంగా అందరిలోనూవుంటాయి. పుట్టుకతోనే వస్తాయి. కొందరిలో ఆ దుర్గుణాలు ఎక్కువగా వుండటంవల్ల వాళ్ళు దుర్మార్గులుగా లోకానికి విదిత మవుతారు. అలాంటి దుర్గుణాలు వున్న వాళ్ళనే మనం దొంగలంటాం, వ్యభిచారులంటాం, మోసగాళ్ళంటాం. కాని మనందరిలో కూడా ఆ చెడు స్వభావాలు వుంటాయి సమపాళ్ళలో."

సైకాలజీ ప్రొఫెసర్ ఇంగ్లీషులో లెక్చర్ ఇస్తున్నాడు జోరుగా, సైకాలజీలోని ఓ ముఖ్యమయిన ఛాప్టర్‌మీద. ఆయనికి సైకాలజీ కొట్టినపిండి. తడుముకోకుండా పాఠం చెప్పుకు పోతుంటారు.

క్లాసులో చాలా మందికి విసుగ్గావుంది ఆ లెక్చర్. తప్పదు కాబట్టి, పోస్టు గ్రాడ్యుయేట్ అనిపించుకోవాలనే ఆసక్తి వున్నవాళ్ళు కాబట్టి వింటున్నారు. నాకు మాత్రం సైకాలజీ లెక్చరర్ చెప్పేపాఠం ఇంటరెస్టింగ్‌గా వుంది. నోట్స్ రాసుకుంటున్నాను శ్రద్ధగా, పాయింట్స్‌ని.

"ఉదాహరణకి దొంగతనం. మొదటి నుంచీ దొంగతనం చెడుగానే పరిగణింపబడుతోంది లోకంలో. చాలా నీచమయినది చౌర్యం. సంఘంలో ఓ ముఖ్యమైన నేరం. అందరూ అసహ్యించుకునే అవినీతి." అని ఆగి ఓసారి ఎఫెక్టుకోసం క్లాసులో మా అందరివంకా చూసి అన్నారు ప్రొఫెసర్.

"అయినా మనందరిలో ఈ దుర్గుణం వుంది. ప్రతీవ్యక్తిలో ఈ దుర్గుణం—దొంగతనం వుండటం గమ్మత్తు."

పాఠం ఆపి కాసేపు మా అందరి వంకా పరిశీలనగా చూసి మళ్ళీ ప్రారంభించారు లెక్చర్.

"అవసరం మనిషిలోని ఆ దుర్గుణాన్ని వెలికితీసి, పెంచి పెద్దచేస్తుంది. ఓ దొంగగా తయారుచేస్తుంది. అవసరం చేత, పరిస్థితులచేత ప్రేరేపింపబడి దొంగగా మిగిలిపోతాడు సమాజంలో."

లేచి నిలబడ్డాను నేను, కొంచెం ధైర్యంగా.

"యస్!"

అడిగారు సైకాలజీ ప్రొఫెసర్ నా వంక చూసి.

"అంటే ప్రతీ వ్యక్తిలో దొంగతనం అనే అవినీతి వుంటుందా సార్?" అడిగాను.

సాధారణంగా సైకాలజీ ప్రొఫెసర్ క్లాసులో ప్రశ్నలు అడగటం అంటే భయం ఎవరికయినా. అందులో లెక్చర్ మధ్యలోలేచి నిలబడి అలా ప్రశ్నలడిగేవాళ్ళు క్లాసు మొత్తానికి ఇద్దరు ముగ్గురు కంటె ఎక్కువమంది లేరు.

'అవును. అందరిలో వుంది. నీలో నాలో. ఈ క్లాసులోని వాళ్ళలో. కాలేజీలోని వాళ్ళలో. ప్రపంచంలో ప్రతి వ్యక్తిలోవుంది. తక్కువ మోతాదులో.''

నన్ను దళసరి కళ్ళద్దాలలోంచి చూస్తూ చిన్నగానవ్వి సమాధానంచెప్పారు ప్రొఫెసర్.

"మీరు చెప్పింది నిజమయితే మరి అందరూ దొంగతనాలు చెయ్యాలిగా?" అడిగాను అర్థంగాక.

తక్కువ మోతాదులో వుంటుంది కాబట్టి అందరికీ అది వృద్ధిఅయ్యే ప్రేరేపణ, అవసరం వుండవుకాబట్టి అంతా దొంగలుగా మారరు. కాని అంతా కనబడని దొంగలే. సమయానుకూలంగా ఈ గుణం ప్రభావితమవుతూంటుంది, చేతల్లో, మాటల్లో.''

కూర్చోమన్నట్లుగా సౌంజ్ఞచేసి మళ్ళీ చెప్పటం మొదలెట్టారు, నేను కూర్చున్నాక.


"దొంగల సంగతి వదిలేస్తే మిగతా మంచివాళ్ళలో కూడా దొంగతనంచేయాలనే ఆసక్తి దాక్కుని వుంటుంది. చాలా చిత్రంగా అది బయటపడటం మనం చూడవచ్చు.''

ఆలోచనగా ఆగారు చెప్పటం. ఓ సారి కళ్ళద్దాలు తుడుచుకుని మళ్ళీపెట్టుకుని తిరిగి ప్రారంభించారు.

"దుర్గుణం, ఏదయినా కావచ్చు, మానవుని మనస్థత్వంలో ఓ భాగం, కొద్దో, గొప్పో మిశ్రమం తప్పకుండా వుంటుంది. కోపం మనకి తెలియకుండానే ఎలా వస్తుందీ, సంతోషం ఎలా సహజమో, దుఃఖం ఎలా పుట్టుక నుంచే వస్తుందో, పగ మనసుంచి ఎలా విడదీయలేనిదో అలాగే దుర్గుణం కూడా పుట్టుకతోనే వస్తుంది, అందరికీ.

మీకు వుదాహరణలు ఇస్తేకాని ఈ భాగం పూర్తిగా అవగతమవదు. ఓ చిన్న కథ చెప్తాను." కథనగానే వుత్సాహంగా వినసాగాను. చిన్నచిన్న పిట్టకథలు ప్రొఫెసర్ బాగా చెప్తారు. చెప్పే విషయానికి నప్పేలా.

"ఒకసారి ఓ రాజుగారు తన రాజ్యములో ఎక్కువ దొంగతనాలు చేసిన ఓ



దొంగని విచారించి మరణశిక్ష విధించాడు. ఆ దొంగని కడపటి కోరిక ఏదయినా వుంటే కోరుకొమ్మని అడిగాడు. లోకంలో అంతవరకూ కనీసం ఓ చిన్న దొంగతనమయినా చెయ్యని వ్యక్తిచేత తనని వురితీయించమని కోరాడు దొంగ. అలాంటివాళ్ళకోసం దేశం అంతా గాలించారు, ఏళ్ళు గడుస్తున్నాయి. అయినా ఎవరూ దొరకలేదు అలాంటివాళ్ళు. చివరికి ఆ దొంగ ఖైదులోనే మరణించాడు ఆయువుతీరి. వురి తీయబడలేదు. ఆఖరికి ఆ రాజుగారు కూడా ఎప్పుడో ఓ దొంగతనం చేశాడు.

"రాజుగారు కూడా దొంగతనం చేశారంటే నేను నమ్మలేను," అన్నాను నేను మళ్ళీ లేచినిలబడి.

"అంత ఐశ్వర్యవంతుడికి దొంగ తనం చేసే అవసరం ఎందుకు వచ్చిం దని అనుమానమా?"

నా వంక చిరునవ్వుతో చూస్తూ అడి గారు సైకాలజీ ప్రొఫెసర్.

''అవును'' అన్నాను కూర్చుని.

''అక్కడే సైకాలజీ సబ్జెక్ట్ ప్రవే శిస్తుంది. మీరు అనేక బలహీనతల గురించి చదువుకున్నారు. దొంగతనం కూడా బలహీనతే. బలహీనత ప్రేరే పిస్తుంది దొంగతనాన్ని. ఆ బలహీనత ఏ రూపంలోనయినా వుండవచ్చు. సాధా రణంగా 'పేదరికం' రూపంలోవుంటుంది. ప్రగాఢమయిన 'కాంక్ష' రూపంలో వుండి ఏదయినా కోరుకున్నది కొనలేనిదయితే దొంగతనం చేయిస్తుంది. ఇలా చాలా రూపాల్లో వుంటుంది మనిషిలోని బల హీనత. వాటిల్లో ఓ రూపం 'అలవాటు'.

మీలో చాలామందికి జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఇంగ్లండు పరిపాలించిన కింగ్ జార్జికి దొంగతనంచేసే అలవాటు ఉందని. ఓ సారి చెప్పాను ఏదో సంద ర్భంలో. సువిశాలమయిన బ్రిటిష్ సామ్రాజ్యం అధినేత, చక్రవర్తి. ఏది కావాలంటే అది లభ్యమవుతుంది. చిటి కెలో. అలాంటి వున్నతుడికే 'చౌర్యం' అబ్బింది. ఎప్పుడయినా విందులకి వెళ్ళి నపుడు విలువయిన వస్తువులు, బంగారు వెండి లోహాలతో తయారయిన ఫోర్క్స్, స్పూన్సు మొదలయినవి దొంగిలించ కుండా వుండలేకపోయేవాడు."

ఓసారి వూపిరి పీల్చుకుని మళ్ళీచెప్ప డం సాగించాడు సైకాలజీ ప్రొఫెసర్.

"మొన్నీమధ్య ఎక్కడో చదివాను. సౌదీ అరేబియా యువరాణి ఫెలియల్ లండన్‌లో షాపింగ్‌కి వెళ్ళినప్పుడు, ఓ అండర్‌వేర్ దొంగిలించింది.''

క్లాసులో మగస్టూడెంట్స్ చాలామంది పైకే నవ్వారు, ఆపుకోలేక.

''అవును."

సైకాలజీ ప్రొఫెసర్‌కూడా నవ్వారు.

"ఆమెని కోర్టులో హాజరు పరచి, జరిమానా విధించారు. అక్కడే మూర్ఛ పోయింది. లుక్ ఎట్ ది సైకాలజీ ఆఫ్ ఎ హ్యూమన్ బీయింగ్. ఆ చిన్న అండర్‌వేర్ కొనలేనంత పేదరాలు, అశక్తురాలు కాదు. అయినా దేనికి ఆ దొంగతనం చేసినట్లు......అలవాటువల్ల అలవాటే బలహీనత మరి."

మౌనంగా అంతా ప్రొఫెసర్‌చెప్పే పాఠం వింటూండిపోయారు, వుత్సా హంగా వుండటంవల్ల.

"మనందరిలోనూ వుంది బలహీనత. మన నిత్యజీవితంలో ఎన్నో సంఘటనలు చూస్తూంటాం. పెళ్ళిళ్ళల్లో అప్పుడే కొన్న మంచి ఖరీదయిన సబ్బు, నీళ్ళ గదిలో మర్చిపోతే తర్వాత కనబడదు. ఆఫీ సర్స్ క్లబ్‌లో పైలట్ పెన్ మర్చిపోతే మర్నాడు నాకు తెలియదంటే నాకు

తెలియదంటారు. ఆఫీసుల్లోంచి వుద్యోగులు పెన్సిల్స్, కాగితాలు ఇంటికి పట్టుకు వెళ్తారు తమ పిల్లలకి, దొంగతనంగా. ఇలాంటి వుదాహరణలు ఎన్నయినా ఇవ్వచ్చు కాని టైంలేదు.''

ఓసారి చేతి గడియారం వంక చూసుకుని ముగించారు సైకాలజీ ప్రొఫెసర్.

"సో, స్టీలింగ్ ఈజ్ ఎ పార్ట్ ఆఫ్ అవర్ నేచర్. మనుష్యుడు పుట్టినప్పుడే దొంగతనం పుట్టింది. మనిషి జీవితంలో ప్రతిచోటా, ప్రతిభాగంలో ఎక్కడో ఓచోట దొంగతనం వుండి వుంటుంది. కాని దాన్ని దొంగతనంగా భావించరు, ఎవరికి వారు. అంత ధైర్యం వుండదు. వీళ్ళ సంగతి ఎవరూ పట్టించుకోరు అంతగా, వీళ్ళవల్ల ప్రమాదం తక్కువ కాబట్టి.

మిగతావాళ్ళకోసమే పోలీసులు, సైనికులు, న్యాయస్థానాలు, అంతర్జాతీయ తీర్పు సంఘాలు మొదలయినవి. తర్వాత క్లాసులో ఈ ఛాప్టర్ ముగిస్తాను. దట్సిట్.''

సైకాలజీ ప్రొఫెసర్ బయటకి నడవగానే అందరూ పుస్తకాలు మూసి లేచారు. అంతదాకా నిశ్శబ్దంగా వున్న క్లాస్ మాటలతో నిండిపోయింది.

"బోరు కొడతాడు ఈ ముసలాడు ఎప్పుడొచ్చినా." అన్నారు ఎవరో నాతో.

చిన్నగా నవ్వి అన్నాను అతనితో.

"ఈ సబ్జెక్టే అంత అసలు మీరుమరో సబ్జెక్టు ఎన్నుకోవలసింది.''

కేంటిన్‌వైపు నడిచాను నేను, సైకాలజీ ప్రొఫెసర్ చెప్పిన పాఠం గురించి ఆలోచిస్తూ. ఆయన చెప్పిన థియరీ నమ్మదగ్గదా, కాదా అన్నవిషయం మీద మర్నాడు వుదయమే ఓ స్థిరాభిప్రాయానికి రాగలిగాను.

*  *  *

కోటీలో బస్ టెర్మినస్‌లో, బస్సు కోసం ఎదురు చూస్తున్నాను వుదయం పదిన్నరకి, లక్‌డికాపూల్ వెళ్ళే బస్సు కోసం.

అక్కడే దగ్గిరలోవున్న ఓ గవర్నమెంట్ ఆఫీసులో కొంచెం పనివుండటం వల్ల. యూనివర్శిటీకి శెలవు అవడంవల్ల అక్కడికి వెళ్ళాలనే ప్రయత్నం మీద బస్సుకోసం ఎదురుచూస్తున్నాను.

ఆర్. టి. సి. టెర్మినస్‌లోకి వచ్చి నూటఇరవై రెండో నెంబరు బస్సు. నేను వెళ్లాల్సినచోటికి వెళ్తుంది ఆ బస్.

బస్సులోని వాళ్ళందరూ దిగగానే నేను బస్సుఎక్కి కూర్చున్నాను. డ్రైవర్ వెనకాలే వున్న మూడుసీట్లరోస్ వదిలి, నాలుగో రో లోని సీట్లో కూర్చున్నాను, ఎడంవైపు కిటికీ దగ్గర.

హైద్రాబాద్‌లోని ఏ సిటీ బస్సులోనయినా అది నా ఫేవరేట్. ఎందుకంటే ఇంకా బ్రహ్మచారిని గనక, ఆ మొదటి మూడు సీట్లరోస్ ఆడవాళ్ళకి ప్రత్యేకింప

బడటంవల్ల దగ్గిరగా కూర్చుని వాళ్ళని చూస్తుంటే అదోఆనందం.

నా పక్కనే షేర్వాణీ, పైజమా, కుచ్చుటోపీలలో వున్న ఒకతను కూర్చున్నాడు, చేతిలో ఏదో వుర్దూ దినపత్రికతో. అతను కూడా బస్సుకోసం నాతో పాటు ఎదురు చూసినవాళ్ళలో ఒకడు.

అయిదు నిముషాల తర్వాత బస్ కదిలింది కండక్టర్ రెండు బెల్స్ కొట్టగానే. నేను ఓపికగా ఎదురు సీట్లో కూర్చుని వున్న గౌనులోని అమ్మాయిని చూస్తుండగా అడిగాడు కండక్టర్.

''యస్. టికెట్.''

''లక్‌డికాపూల్'' ఇరవై పైసలబిళ్ళ అందించి అన్నాను. కండక్టర్ టిక్కెట్ చింపి అందించాడు నాకు. డబ్బు బేగ్‌లో వేసుకుని.

''ఆప్ కహాఁతక్?''

నా పక్కన కూర్చునున్నతన్ని అడిగాడు కండక్టర్,

''స్టాఫ్.''

చెప్పాడు అతను వుర్దూ పేపరులోంచి తల ఎత్తకుండానే.

''ఠీక్ హై''

కండక్టర్ ముందుకు వెళ్ళిపోయాడు, బస్‌లో చాలా రష్‌గా వుండటంవల్ల, మిగతా వాళ్ళకి టిక్కెట్స్ ఇస్తూ. నేను కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాను.

అబిడ్స్‌లో ఆగింది బస్. తోసుకుని ఎక్కుతున్నారు చాలామంది, దిగేవాళ్లని దిగనివ్వకుండా. ఆఫీస్ అవర్స్ కాబట్టి బాగా రష్‌గావుంది, బస్ బయటా లోపల కూడా.

బస్ కదులుతూండగా అరిచారు ఎవరో.

''నా పర్స్!''

కండక్టర్ ఒక బెల్ కొట్టాడు, బస్సు ఆగిపోయింది వెంటనే.

''నా పర్సు కొట్టేశారు ఎవరో.''

ఓ ముప్ఫైఏళ్ళతను అరిచాడు కిందికి దిగుతూ. చాలామంది అడుగుతున్నారు ఖంగారుపడుతున్న అతన్ని అనేక ప్రశ్నలు. అతను సమాధానం చెప్పకుండా, కింద గుంపులో కలసిపోతున్న ఓ ఇరవై ఏళ్ళకుర్రాడి చెయ్యి పట్టుకున్నాడు గట్టిగా. ఆ కుర్రాడి బనియన్ లోంచి పర్స్ తీసాడు బయటకి అతనే.

''దొంగ రాస్కెల్.''

చాచి లెంపకాయ కొట్టాడు పర్స్ దొరికినతను ఆ దొంగని కసితీరా. నాలుగయిదు చేతులు పడ్డాయి, ఆ దొంగ. మీద. బాధగా అరుస్తున్నాడు ఆ దొంగ పారిపోకుండా ఇద్దరు పట్టుకుంటే తంతున్నారు, మిగతావాళ్ళు ఆ దొంగని ఇష్టం వచ్చినట్లు.

కండక్టర్ బెల్‌కొట్టాడు. బస్సు కదిలింది. అంత గొడవవుతున్నా ఉర్దూ పత్రికలోంచి తలఎత్తలేదు నా పక్కన కూర్చున్నతను. తల వెనక్కితిప్పి ఆ

పుంగు కనబడేదాకా చూస్తూండిపోయాను నేను.

బాగాతన్ని తర్వాత పోలీసులకి అప్ప చెప్తారు బహుశా. లేదా అలా వదిలేసే వెళ్ళిపోతారు ఎవరిదోవనవాళ్ళు. వాడు తన దురదృష్టాన్ని తిట్టుకుని మళ్ళీ ఇంకో చోట ప్రయత్నంచేస్తాడు. సైకాలజీ ప్రొఫెసర్ ఇచ్చిన లెక్చర్ గుర్తు కొచ్చింది

అవసరం, పరిస్థితులు ప్రేరేపించి ఉంటాయి అతన్ని దొంగతనానికి. అతని లోని దొంగబుద్ధి అభివృద్ధి చెంది వుంటుంది, పేదరికంవల్ల.

అయిదు నిమిషాల తర్వాత బస్ దిగాను నేను లక్‌డీకాపూల్ బస్‌స్టాప్‌లో. దగ్గిరేవున్న ఓ హోటల్‌లో కాఫీతాగి నేను వెళ్ళవలసిన గవర్నమెంట్ ఆఫీస్‌కి వెళ్ళాను.

నాకు పనివున్న సెక్షన్‌లోకివెళ్ళాను. నా కాగితం ఎవరిదగ్గరవుందో వాళ్ళు ఇంకారాలేదు, ఆఫీస్‌టైం దాటినాకూడా. గవర్నమెంట్ ఆఫీస్‌లో అలస్యం సహజం కాబట్టి, గవర్నమెంట్‌కాలం దొంగతనం చేస్తున్నారు ఉద్యోగులు అనుకున్నాను సైకాలజీ ప్రొఫెసర్ చెప్పిన మాటలు అన్వయించుకుంటూ.

బయటకివెళ్ళి మరో అరగంటతర్వాత వచ్చాను, ఒకరిద్దరు స్నేహితులనికలసి. స్నేహితులతో మాట్లాడుతూండగా ఇంగ్లీష్‌లో నా ఫేవరేట్ టైటిల్ ట్యూన్ తెలుగులో వినబడటంవల్లఅబ్బురపడ్డాను.

నా స్నేహితులు చెప్పారు, తెలుగు మ్యూజిక్ డైరెక్టర్ ఆ కమ్మటి ఇంగ్లీష్ ట్యూన్‌ని కాపీకొట్టి వుంటాడని.

'దొంగతనం' అనుకున్నాను మన సులో.మళ్ళీతిరిగివెళ్ళాను ఆ సెక్షన్‌లోకి. ఇందాక ఖాళీగావున్న సీట్‌లో ఒకతను కూర్చునివున్నాడు. అతని దగ్గరే నాకు సంబంధించిన పేపర్ వుంది.

ఇదివరకెప్పుడూ అతన్ని ఆ సీట్‌లో చూడకపోయినా గుర్తుపట్టాను, చూడం గానే నా పేపర్ సంగతి అడిగాను.

నన్ను తేరిపారజూసి అన్నాడు నిర్ల క్ష్యంగా:

"మరోవారం రోజులాగిరండి. మీ పేపర్‌కన్నా ఇంకా ముందువచ్చిన పేపర్‌లు చాలాఅవుట్‌స్టాండింగ్‌లోవుండి పోయాయి."

వీలయినంత త్వరగా నా పేపర్ సంగతి చూడమని చెప్పి బయటపడ్డాను.

ఇందాకా కోఠీనుంచి లక్‌డీకాపూల్ దాకా నాతోపాటు, నా పక్కనే కూర్చుని ప్రయాణంచేసిన పెద్దమనిషే ఆయన.

సూపరింటెండెంట్ కాబట్టి అయిదారు వందలు తక్కువలేకుండా వస్తుంది జీతం నెలనెలా. నాకు గుర్తుకువచ్చింది బస్‌లో సంభాషణ. 'ఆప్ కహాతక్ ?' కండక్టర్ ప్రశ్న. 'స్టాఫ్' అయన జవాబు!

స్టాఫ్!

స్టాఫ్‌కాదు అతను. ఆర్. టి. సి. లో పనిచేసే ఉద్యోగులు సిటీబస్సుల్లో బస్ టిక్కెట్స్ కొనక్కరలేదు. ఉచితంగా ప్రయాణంచేయవచ్చు. కండక్టర్ టిక్కెట్ అడిగినప్పుడు తను స్టాఫ్‌ననీ ఆర్. టి. సి లో పనిచేసే ఉద్యోగిననీ, అబద్ధం ఆడాడు అతను.

కాని నిజానికి స్టాఫ్‌కాదు. అబద్ధం. అబద్ధం ఆడాడు. దేనికి ?

డబ్బు ఆదాచేసేందుకు.

ఎంత ?

ఇరవై పైసలు.

ముష్టి ఇరవై పైసలు ఆదాచేసేందుకు అబద్ధం ఆడి టిక్కెట్ కొనలేదు అతను. చాలా రష్‌గా వుండటంవల్ల, అతనిలోని పెద్దమనిషితరహాని చూసి, కండక్టర్ నమ్మకంతో 'స్టాఫ్ ఐడెంటిటీ కార్డ్' తణిఖీ చెయ్యలేదు.

చెయ్యడనికూడా తెలుసు అతనికి. అందుకే ధైర్యంగా అబద్ధం ఆడాడు.

బాధ్యతగల గవర్నమెంట్ ఉద్యోగి. నెలకి అయిదువందలు తక్కువలేకుండా సంపాదిస్తున్నప్పుడు, ఇరవై పైసలు పెట్టి బస్‌టిక్కెట్ కొనుక్కోలేనంతదౌర్భాగ్య స్థితిలోలేడు.

కొనగలడు టిక్కెట్‌ని. కాని కొనలేదు, ఎందుకు ?

ఎందుకు కొనలేదు ?

'అక్కడే సైకాలజీ సబ్జెక్ట్ ప్రవేశిస్తుంది'

సైకాలజీ ప్రొఫెసర్ మాటలు చెవుల్లో మోగాయి. ఇదీ ఒకవిధంగా దొంగతనమే. ఆర్. టి. సి. సర్వీస్‌ని దొంగతనం చేయడంలాంటిదే, టిక్కెట్ లేకుండా, వుచితంగా ప్రయాణంచేయడం.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ పట్టుకుంటే ఇరవై పైసల టిక్కెట్ కొనిపిస్తాడు. అంతే. ఆబిడ్స్‌లోని పిక్‌పాకెటర్‌ని కొట్టినట్లు కొట్టరు ఈ దొంగని.

ఇరవై పైసలు ఆదా చేద్దామని కాదు. అతనిలోని దొంగబుద్ధి. అంతేకారణం. బలహీనతకి లొంగనివాడెవడు లోకంలో?

నాకు నమ్మకం కలిగింది ఎందుకు సైకాలజీ ప్రొఫెసర్ చెప్పిన పిట్టకథలోని రాజుగారు దొంగతనం చేసాడో. ఎందుకు చక్రవర్తి, కింగ్ జార్జ్‌ఫోర్క్స్, స్నూప్స్ దొంగతనం చేసాడో. ఎందుకు సౌదీ అరేబియా యువరాణి అండర్‌వేర్ దొంగతనం చేసిందో. రోజూ నేను చేస్తున్న చేతల్లో ఎందుకు దొంగతనపు చేష్టలు నిండివున్నాయో...?

మానవుని మనస్తత్వంలో క్షొద్దో గొప్పో దొంగబుద్ధి నిద్రాణమైవుంటుంది ఎప్పుడూ, అన్నది విదితమైంది నాకు!

